# పేగుబంధం

"దున్నపోతుల రామయ్యా! ఓ దున్నపోతుల రామయ్యా!" తనను ఇంటిపేరుతో కాకుండా, ఈ పేరుతోనే పిలిచే పిలుపులు రామయ్యచెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. "ఎన్రోజులు దుంతవయ్యా గీ దున్నపోతుల్తోని...? అవ్వేమొ నడ్సి సావయి... రొాండెడ్లు కొనుక్కుంటె సత్తవా?" తనను దెప్పిపొడిచే వాళ్ళ మాటలు జ్ఞాపకం వచ్చాయతనికి.

"చినుకు పడితే చాలు నిల్చుంటయి. ఎండకాలంలో నీళ్ళు కనబడితే సాలు పండి బొర్లుతయి... దున్నపోతులతోని దున్ను దున్ని నువ్వుగూడ వాటి లెక్కనే ఐపెయినట్టున్నవు...నీకెంత జెప్పినా దున్నపోతుమీద వాన గొట్టినట్టే ఐతంది. చప్పుడు జేక రొాండెడ్లు కొనుక్కో... గా ఎనుప సనుగుతోనేం తిప్పలు పడతవు..."

కాపు రాజిరెడ్డి మాటలు జ్ఞాపకం వచ్చాయి రామయ్యకు. తాను దున్నపోతుల నాగలి గట్టి వ్యవసాయం చేస్తున్నాడు కాబట్టి తనను దున్నపోతుల రామయ్యానే పిలవడం, తన వ్యవసాయాన్నందరూ దున్నపోతుల వ్యవసాయమని దెప్పడం మదిలో మెదిలి బాధపడుతున్నాడు రామయ్య.

"చద్ది తిన్నమ్మకు మొగనాకలేం తెలుసు...? దున్నపోతులతోని ఎవుసం చేసుడు తనకేమన్నా షోకా...? కానీ ఏం జెయ్యాలి...? ఎంత జేసినా ఎక్కడేసిన గొంగడక్కడున్నట్టేగావట్టె... ఒంటినాగలెవుసంతోని గట్టుకు కట్టెలు మోసినట్టే కావట్టె. ఎడ్ల కొనుక్కోవన్నని తనకు లేదా...? ఉంటేంసంబురం...? ఎల్లద్దామరి...? ఒక్కొక్క ఎద్దు కెంతగావాలె...? నా చిన్నప్పుడు వెయ్యి రూపాయలకో ఎద్దు, వందరూపాయలకు గిద్దెడు వడ్లు అమ్మితే ప్రపంచం మునుగుత దనేటోళ్ళు... ఇప్పుడు మామూలెద్దుకే వెయ్యి దాటినయి... అయినా ఎప్పుడున్న కష్టాలప్పుడున్నాయి."

తన నందరు దున్నపోతు రామయ్యని పిల్చుడు, వాటి పేరు మీద పిల్చుడు మంచిగలేదు. ఎట్లైనా మంచిదే, ఎడ్లను కొనుక్కోవాలి. ఎడ్లతోని సేనుగూడ ఎదుగుతది. దున్నపోతులు పాడుగాను ఎండకాలం బురదకుంట కనబడితే సాలు పొయ్యి బొర్లుడేనాయె. ఎన్నిసార్లు ఎడ్లు కొందామన్నా ఏదోటి అడ్డమొచ్చె. పంట పండకపాయె, పండినేడు ధరుండకపాయె. ఓసారోసారి పెట్టువళ్ళ ఖర్చులన్న ఎల్లకపాయె... ఏదేమైన మంచిదె కాని ఆరు నూరైనా అటున్న సూర్యుడిటు పొడిచినా అగద్దు ఇయ్యేడు... ఎడ్లు కొనుడే...

తనలో తాను గొణుక్కుంటున్నట్టనుకున్నాడు రామయ్య "ఛా...ఛా... దున్నపోతుల పాడుగాను... ఎండెక్కిందంటే ఒగరు కొడ్తాయి... సరిగ్గ నడువయి..." ముల్లు కర్రతో

రెండింటి రొంటిపై పొడిచాడు రామయ్య. ఒగరుస్తూ బండి లాగుతున్నాయి దున్నపోతులు... "ఈ యేడు పంటో తీరుగనే వచ్చింది... వడ్లు మంచి బరుకతున్నయి. ధర గూడ మంచిగనే పడ్డది, రొండు భర్తీల వడ్లమ్ముతె మూడువేల రూపాయలచ్చినవి. వెయ్యి రూపాయలు చిల్లర బాకీలకు పోతయి... ఆ రొండు వెయ్యిలతోని రొండు బక్కా'ట్నే కొనాలె... వద్దు... వద్దు. కులం చెడ్డందుకు సుఖమన్న దక్కాలె... ఇంత బాకైనా మంచిదే కాని రొండు మంచెడ్లనే కొనాలె... ఈ దున్నపోతుల నమ్మిపారెయ్యాలె... వీటితో నెవుసం జేసుడు గాదు... ఇయ్యేడెడ్లు కొనుడే..."

ఎడ్లు కొనాలని దృఢనిర్ణయం చేసుకున్నాడు రామయ్య. "ఔ...ఔ... మిమ్ముల దొంగల్దిన... నీళ్ళుకనబడితే సాలు ఉరుకుడే..." నీళ్ళ దిక్కు గుంజుతూన్న దున్నపోతుల వీపుమీద రెండు దెబ్బలేసి త్రోవలో పెట్టాడు బండిని.

బండి ఊరి పొలిమేరల్లోకి ప్రవేశించింది. 'వడ్లను కరీంనగర్ బీటికి కొడ్దామను కున్న...గీ దున్నపోతులు గంత దూరం నడువయని ఊకుంటి... నాలుగు పైసలు తక్కువైనా మంచిదేనని పక్కూరు బీటికి కొడితి...' తనలో తాననుకుంటూ బండి నడిపిస్తున్నాడు రామయ్య.

"ఏందోయ్ దున్నపోతుల రామయ్యా! దున్నపోతులు బండిని మంచిగనే గుంజుతున్నట్టున్నయిగద...! నిన్నో భర్తీ వడ్లు కొట్టినట్టునవు బీటికి... వడ్లమ్ముడై పోయినట్టేనా...?" నడుస్తున్న బండినెక్కి అన్నాడు రాజయ్య.

అతని సంబోధనకు మనస్సు చివుక్కుమంది రామయ్యకు... "ఇంకెన్ని రోజులు నన్నిలా పిలుస్తారు...? నేను కూడా ఎడ్ల కొంట..." తనలో తాననుకున్నాడు...

"రామయ్యని పిలిస్తె చాలదా...? దున్నపోతుల రామయ్యని పిలిస్తేనే నీకు తృప్తా...?" ముఖం ముడుచుకొని అన్నాడు...

రామయ్య మాటల కాశ్చర్యపోయాడు రాజయ్య..."ఎన్నడులేందేమొ కోపానికి రావడ్తివేంది రామయ్య...? దున్నపోతుల్తోని నాగల్దున్నే నిన్ను దున్నపోతుల రామయ్యని కాకుంటె ఏమని పిలువమంటవు చెప్పు...?" అన్నాడు రాజయ్య...

"నువ్వెడ్లతోని నాగలి దుంతవు...నిన్ను ఎడ్ల రాజయ్యని పిలువన్నా మరి...?" అన్నాడు రామయ్య...

"అందరూ ఎడ్లతోనే ఎవుసం జేత్తరు... నువ్వొక్కనివే దున్నపోతులతో నెవుసం జేత్తవు... అందుకే ఊరంత నిన్నట్ల పిలుస్తరు... అంత రేషముంటె వీట్నమ్మి ఎడ్ల కొనలేవు..." అన్నాడు రాజయ్య...

ఆ మాటలకు రేషమొచ్చింది రామయ్యకు... దానికితోడు జేబులో వడ్లమ్మిన డబ్బులున్నాయి.

"మా కొంట... బేస్తవారం అంగట్లకు పొయ్యి కొనుక్కత్తనో, కొనుక్కరానో సూడు...! ఈ దున్నపోతులను అమ్ముత... ఎవ్వలకన్న చెప్పు..." అన్నాడు రామయ్య...

"ఏ పాటి కొంటవో నేంజూత్తగద...! వీటికేం ధర రాదుగని ఎడ్లనైతే కొను..." అన్నాడు రాజయ్య...

ఇంతలో రామయ్య ఎడ్ల కొఠం వచ్చింది... బండాపాడు రామయ్య... బండ్లోంచి దూకి వెళ్ళిపోయాడు రాజయ్య.

బండి విడిచాడు రామయ్య... బావి దగ్గరకు తీసుకెళ్ళి దున్నపోతులకు నీళ్ళు పెట్టాడు... అవి కడుపు నిండా నీళ్ళు తాగింతర్వాత కొఠంలో కట్టేశాడు. వరిగడ్డి వామునుంచి గడ్డి గుంజి వాటి ముందటేశాడు... బోరెం తలమీదేసుకొని, కనాలు, ముల్లు గఱ్ఱ చేతబట్టుకొని ఇల్లు చేరుకున్నాడు. ఇంటి ముందు జనం గుమిగూడి ఉండటం చూసి బోరెం వాకిట్లో పడేసి అలాగే నిల్చున్నాడు...

"మీ నాయిన్నకు మూత్రం బందైంది... ఆర్.ఎమ్.పి. పిల్లగాడచ్చి చూసిండు... మందులిచ్చిండు... తన నుంచి కాదన్నడు... కరీంనగర్ పెద్దాసుపత్రికి తీసుకపొమ్మన్నాడు..."

ఆ మాటలు విని కొద్ది క్షణాలు స్థాణువులా నిల్చున్నాడు రామయ్య. అతని కళ్ళముందెన్నో విషయాలు కదిలాయి... ఎడ్లు కొనుక్కోవాలనుకున్న తన నిర్ణయం...?

కనాలు, ముల్లుగఱ్ఱ వాకిట్లో పడేసి అరుగెక్కాడు రామయ్య... బాధతో గిలగిలా కొట్టుకుంటున్న తండ్రిని సమీపించాడు.

"అక్కడికెళ్ళినా ముసలోడు బతకుతడా...?"

"కొద్ది పైసలైతయా? వేల రూపాయలు గావాలె..."

"పైసలైతయని చంపుకుంటరా ఏంది...?"

వాకిట్లో ఉన్న జనాలు రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు... వాళ్ళ మాటలు వింటూ తండ్రిమీద చెయ్యేశాడు రాజయ్య.

బాధ కాగలేక లబోదిబోమని మొత్తుకుంటున్నాడా వృద్ధుడు...

"ఏంది రామయ్యేం మాట్లాడవేంది...?" ఒక్కమాటైనా మాట్లాడని రామయ్యతో అన్నాడొకతను...

ఎడ్లు కొనుక్కోవాలనుకున్న తన చిరకాల వాంఛకు తండ్రి రూపంలో విఘాతం కలుగబోతుంటే ఏం మాట్లాడాలో తోచలేదాతనికి... కొద్ది క్షణాలాగి–

"ఇక్కడ మంచిగ కాదా...?" అన్నాడు...

"కాదని అందరు చెప్పతండ్రు... అపరేషన్ చెయ్యంది ఇది మంచిగ కాదు... ఇక్కన్నే ఉంచుతే ఉచ్చెత్తారంగ చచ్చిపోతడు ముసలోడు..." అన్నాడో పెద్దమనిషి...

"వడ్లమ్మితె వచ్చిన పైసలున్నయిగద రామయ్య... జెప్పన తయ్యారు కా..." అన్నాడు మరొకతను.

"కొడుకా, నేం బతకరా...వయ్యా...వయ్యా...వయ్యా..." మొత్తుకుంటున్నాడు వృద్ధుడు.

రామయ్య నందరూ వత్తిడి చేస్తున్నారు...

ఉన్న డబ్బును తండ్రికోసం హాస్పిటల్ పాలు చేయడం రామయ్యకు నచ్చడం లేదు.

"తీసుక పోకుంటేంది...? మంచిగ్గాదా ఇక్కడ...?" అన్నాడు.

అందరూ అతనిమీదికి గయ్‌మని లేచారు...

"లే... తొందరగ తయారుకా... బస్సచ్చే యాల్లైతంది..."

ఇక తప్పలేదు రామయ్యకు... లేచి తయారయ్యాడు... పిల్లలను పక్కింటివాళ్ళ కప్పగించాడు... దున్నపోతులను చూసుకొమ్మని మరొకరికి చెప్పాడు.

భార్యతోపాటు తండ్రిని తీసుకొని బస్టాండు కొచ్చాడు... కొద్దిసేపట్లో వచ్చిన బస్సులో తండ్రిని, భార్యను ఎక్కించి తాను కూర్చున్నాడు... తండ్రి మూలుగుతన్నాడు... ఏడుస్తున్నాడు... ఒక్కోసారి గట్టిగా అరుస్తున్నాడు...

బస్సు కదిలింది.

తన చిరకాలపు కోర్కె ఈ విధంగా విఫలమవుతున్నందుకు రామయ్యకు తండ్రిపై కోపంగా వుంది... మంటగా వుంది...

'ఈ ముసలోడు బతికేం చేస్తడు? ఎన్నో ఏండ్లు నుంచి ఎడ్ల కొనుక్కోవన్నను కుంటున్న... ఇప్పుడు కొందామనుకునె వారకు గీ ఆపదచ్చె...! ముసలోడు చస్తే పీడ పొయ్యేది...! ఉండేం చేస్తడు...? ముసలోడు చచ్చిపోవాలె... దావఖానకు చేరకముందే చచ్చిపోవాలె... దావఖాండ్ల కొద్ది రోజులున్నంక పైసలన్ని ఖర్చయినంక చచ్చిపోతేం లాభం...? అక్కడికి చేరేసరికే చచ్చిపోతే మంచిగుండు...ముసలోడు చచ్చిపోతే ఈ పైసలు మిగుల్తయి. ఈ పైసల్తోని ఎడ్ల కొనుక్కోవచ్చు. మంచిగ వ్యవసాయం చేసుకోవచ్చు. తనను దున్నపోతుల రామయ్యని పిలిచెటోల్ల నోర్లు మూపియ్యొచ్చు... ముసలోడు చావాలె...చావాలె... దావఖానకు చేరకముందే చావాలె...' తనలో తాననుకొని తండ్రిని కోపంగా చూసాడు.

బస్సు గమ్యస్థానం చేరడానికి పరుగులు తీస్తోంది.

'తను ఇలా ఎందుకనుకుంటున్నాడు...? తండ్రినే చావాలని ఎందుకు కోరుకుంటున్నాడు...? తనలాగే తన పిల్లలూ కోరుకుంటే...? తననెంతో ప్రేమగా పెంచిండు నాన్న, భుజాలపైన ఎత్తుకొని తిప్పిండు... చిన్నప్పుడు తన మీదెంతో పావురం... అలాంటి తండ్రిని చావాలనుకుంటున్నాడు తాను...

'తనకు ఎడ్లు కావాలి... ఇన్నేళ్లకు తన కోరిక తీరబోతున్న సమయంలో సైంధవుడిలా తండ్రి ఆరోగ్యం... తనకు భారమైన నాన్న చావాలి... హాస్పిటల్ చేరకముందే చావాలి.'

రామయ్యలో ఘర్షణ చెలరేగుతుంది... అతనిలో సంఘర్షణ మొదలైంది.

తండ్రి దిక్కు తిరస్కార భావంతో చూస్తున్నాడు. బస్సు ఓ స్టేజి దగ్గరాగింది.

బస్సు కిటికీ దగ్గర కూర్చొనున్న రామయ్య కిటికీలోంచి బయటకు చూసాడు. కనబడిన దృశ్యాన్ని చూసి చలించిపోయాడు.

రోడ్డు ప్రక్కనే ఓ చెట్టుంది. చెట్టుక్రింద టెంటులా వేసుంది. టెంటు ముందు ఒక వృద్ధురాలు పడుకొనుంది. ఆమె చూడడానికెంతో అసహ్యంగా ఉంది. ఆమె కాళ్ళు చేతులు పక్షవాతంతో పడిపోయాయి. ఆమెను లేపి తననానుకొని

కూర్చునేట్టు కూర్చోబెట్టి తన చేత్తో అన్నం తినిపిస్తున్నాడామె కొడుకు. నోటి నుంచి కారుతున్న చొంగను అసహ్యించుకోకుండా తీసివేస్తున్నాడు. అసహ్యంగా వున్న ఆమె ఆకారాన్ని చూసి ఏమాత్రం చీదరించుకోవడం లేదతను. ఆప్యాయంగా, ప్రేమగా తల్లిని బుదరికిస్తూ అన్నం తినిపిస్తున్నాడు.

ఆ దృశ్యం చూసిన రామయ్య కళ్ళు తిరిగాయి. తనపై తనకే అసహ్యం కలిగింది.

టీ తాగడానికి దిగిన కండెక్టర్, డ్రైవర్ ఎక్కగానే బస్సు కదిలింది.

ఆ బిచ్చగత్తె తనకేమిచ్చిందని ఆమెనంత ప్రేమగా చూసుకుంటున్నాడామె కొడుకు? కదలలేని స్థితిలో వున్న తల్లిని ఏం కోరి అంత ఆప్యాయంగా ఆదరిస్తున్నాడు...?

రామయ్యలో రకరకాల ప్రశ్నలు.

మరి తాను...? తన తండ్రి తనకు రెండుమూడెకరాల భూమి సంపాదించిచ్చాడు. పాతదైనా ఉండడానికి చిన్న పెంకుటిల్లిచ్చాడు. తననెంతో ప్రేమగా చూసుకున్నాడు. అలాంటి తండ్రికి ఆపదొస్తే తానతన్ని చావాలనుకున్నాడు. తానసలు మనిషా...? రాక్షసుడా...? తండ్రి తనకేమివ్వకున్నా తానిలా ఆలోచించడం సరైందేనా...? తనకు జన్మనిచ్చిన తండ్రినే చావాలని కోరుకున్న తనేం మనిషి...? ఆ బిచ్చగాడికున్న ఇంగిత జ్ఞానమన్నా తనకెందుకు లేదు?

తనకు తానే నిందుంచుకున్నాడు రామయ్య.

లక్షల ఆస్తులను తీసుకొనే తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినవాళ్ళను జ్ఞాపకం చేసుకున్నాడు రామయ్య.

తానలాంటివాడు కాదు... ఎడ్లు కొనుక్కోవాలన్న ఆలోచనతో తానెంత నీచంగా ఆలోచించాడు...? తనలాగే అందరూ ఆలోచిస్తే వృద్ధుల గతేం కావాలి? అసలు మానవత్వం మాటేంటి? తనకు మంచి కాలం రాకపోదు. అప్పుడు ఎడ్లు కొనుక్కుంటాడు. తానెడ్లు కొనుక్కునే పరిస్థితి రాకున్నా మంచిదే. తాను దున్నపోతుల రామయ్యగానే జీవితాంతం బ్రతుకుతాడు. కాని, తాను తన తండ్రిని రక్షించుకోవాలి. ఈ డబ్బేకాదు మరంత అప్పైనా తన తండ్రిని కాపాడుకోవాలి.

రామయ్య పేగు బొర్లింది. కన్నతండ్రిపై అనురాగం పెల్లుబికింది. అతని కనుకొలుకుల్నుండి టపాటపా నీళ్ళు రాలాయి.

తండ్రి నాప్యాయంగా దగ్గరకు తీసుకొని తననానుకొని కూర్చుండబెట్టుకున్నాడు.

భర్తలో వచ్చిన మార్పు, అతనిలో జరుగుతున్న అంతరంగ మథనం అర్థంకాక రామయ్య భార్య అతన్ని ఆశ్చర్యంగా చూస్తోంది.

బస్సు గమ్యస్థానం దిక్కు పరుగెడుతూనే వుంది...

● *ఆదివారం ఆంధ్రప్రభ, 9–5–93* ●

★ ★ ★